## • దేవుళ్లపై ఒట్టేసి నిరసన



తమకు రుణమాఫీ కాలేదని, రైతు భరోసా రాలేదని ఆదిలాబాద్ జిల్లా ముక్రా(కే) గ్రామస్తులు దేవుళ్లపై ఒట్టేసి నిరసన తెలిపారు. గురువారం ఇచ్చోడలోని శివాలయం వద్ద దేవుళ్లపై ఒట్టేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ అన్ని పథకాలు ప్రజలకు అందుతున్నాయని అబద్ధం చెబుతున్నారని విమర్శించారు. ముక్రా(కే)లో సగం మందికే రుణమాఫీ, రైతు భరోసా వచ్చిందన్నారు. ప్రతి రైతుకూ రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. – ఇచ్చోడ



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం ముంగిముడుగు కొనుగోలు కేంద్రంలో వడ్లు తడవకుండా టార్పాలిన్ కప్పుతున్న రైతులు

# బస్తాలు లేవు.. లారీలు రావు

- కాంటాలు కాక రైతుల ఇబ్బందులు
- తమ గోస ఎవరికీ పట్టట్లేదని ఆవేదన

నర్సింహులపేట, మే 1 : కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు బస్తాలు లేక.. మరోవైపు లారీలు రాక.. ఇంకో వైపు అకాల వర్షాలు, అసౌకర్యాలు.. వెరసి అన్నదాతలు కొనుగోలు కేంద్రాల వద్ద కంటిమీద కునుకు లేకుండా కాలం గడుపుతున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రం తోపాటు పెద్దనాగారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, ముంగిమడుగు, వంతడపలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అసౌకర్యాలతో రైతులు అవస్థలు పడుతున్నారు. ముంగిమడుగు కొనుగోలు కేంద్రంలో బస్తాలు అందుబాటులో లేక కాంటాలు నిలిచాయి. కాంటా పెట్టిన 4,980 బస్తాల్లో ఇంకా 3,200 బస్తాలు లారీలు రాక అక్కడే ఉండిపోయాయి. నర్సింహులపేటలో 15,103 బస్తాలు కాంటాలు పెట్టగా, ఇంకా 7,021 బస్తాలు కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. పెద్దనాగారంలో 7,021 బస్తాలు కాంటాలు పెట్టగా, 4,157 బస్తాలు కేంద్రంలో ఉన్నాయి. దీంతో ధాన్యం కాంటా పెట్టిన రైతులు, కాంటాలు పెట్టాల్సిన రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులుకాయాల్సి వస్తున్నది..

### ఇరవై రోజులుగా కాంటా పెట్టలేరు



నేను ఇరవై రోజుల క్రితం వడ్లు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన. మొదట్లో హమాలీలు లేరని చెప్పారు. హమాలీలు వచ్చిన తర్వాత కొంతమంది రైతుల ధాన్యం కాంటా పెట్టారు. మళ్లీ ఇప్పుడేమో బస్తాలు రాలేదని కాంటాలు పెట్టడం లేదు. వాన వస్తుంది.. ఎండిన వడ్లు తడుస్తున్నాయి. మా బాధలను అర్థం చేసుకునే వారే లేరు.

– బానోత్ సంతోష్, గోల్‌బోడ్కతండా



ఖమ్మం జిల్లా కారేపల్లిలో ఈదురుగాలులకు నేలవాలిన బొప్పాయి తోట



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో రాలిన మామిడికాయలు

# గాలివాన బీభత్సం

## పలు జిల్లాల్లో నేలరాలిన బొప్పాయి, మామిడి

### కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
### ఈదురుగాలులకు ఎగిరిపడ్డ ఇండ్ల పైకప్పులు
### పలుచోట్ల నిలిచిపోయిన విద్యుత్తు సరఫరా

నమస్తే నెట్‌వర్క్, మే 1 : పలు జిల్లాల్లో బుధవారం రాత్రి, గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కురిసిన వర్షం రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. కల్లాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోగా.. చేతికొచ్చిన బొప్పాయి తోటలు విరిగిపోయాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం సూర్యాతండాలో రైతు వాంకుడోతు బాలకు చెందిన పది ఎకరాల బొప్పాయి తోట నేలకొరిగింది. కారేపల్లి క్రాస్ రోడ్‌లో భూక్యా శంకర్ ఐదెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేసిన బొప్పాయి తోట నేలకొరిగింది. రూ.10 లక్షల నష్టం వాటిల్లినట్టు రైతు శంకర్ వాపోయాడు. తిరుమలాయపాలెం మండలం బచ్చోడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యపు రాసులు తడిసిముద్దయ్యాయి. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గంగారంలో కోళ్లఫాం పూర్తిగా నేలమట్టమైంది. గుండ్లసోమారంలో పది రేకుల ఇండ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. భీమారం మండలం దాంపూర్‌లో కందుల లింగయ్యకు చెందిన మామిడితోటలో కాయలు రాలిపడి నష్టంవాటిల్లింది. రెడ్డిపల్లి, ధర్మారం, కాజీపల్లి, భీమారంలోనూ మామిడి పంటకు నష్టం వాటిల్లింది. దాంపూర్‌లో ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. రెడ్డిపల్లి, వెల్లపల్లి, బూర్గుపల్లి పరిధిలో మామిడి తోటలు, వరిపొలాలను హార్టికల్చర్ అధికారి కల్యాణి, మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ పరిశీలించారు. చెన్నూర్ మండలంలో సుద్దాల, లంబాడిపల్లె, కన్నెపల్లి, సంకారం, బుద్ధారం, అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట, లింగంపల్లి గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. అధికారులు స్పందించి నష్ట పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వరి పంట నేలమట్టం కాగా, మామిడికాయలు రాలిపోయాయి. ఇండ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. చెట్లు కూలగా, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అక్కడక్కడా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మక్కలు తడిసి ముద్దయ్యాయి.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో నేలమట్టమైన వరి



మంచిర్యాల జిల్లా భీమారం మండలం దాంపూర్‌లో నేలకొరిగిన వరి చేనును పరిశీలిస్తున్న అధికారులు

## రేవంత్‌కు భయపడేటోళ్లు ఎవరూ లేరు!

- ఆయన వల్లే కులగణన అనేది హాస్యాస్పదం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ) : రాహుల్ గాంధీకో, రేవంత్‌రెడ్డికో భయపడి తాము కులగణన నిర్ణయం తీసుకోలేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం ఢిల్లీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కులగణనపై నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రతిపక్షాలు రాజకీయ నాటకాలకు తెర లేపాయని ఆరోపించారు. దళితుడైన రామ్‌నాథ్ కోవింద్, ఎస్టీ అయిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతి అభ్యర్థులుగా ప్రకటించినప్పుడు వ్యతిరేకించి కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను బరిలోకి దింపిందని ఆయన గుర్తుచేశారు. వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన ప్రధాని మోదీని కులం పేరుతో దూషించిన చరిత్ర కాంగ్రెస్‌దని మండిపడ్డారు. కులగణన నిర్ణయం తమ విజయంగా కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకుంటుందని, మరి 60 ఏండ్లు పాలించిన ఆ పార్టీ కులగణన ఎందుకు చేయలేదు? అని ప్రశ్నించారు.

## గొర్రెల పంపిణీ కేసులో ఏసీబీ సోదాలు

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): గొర్రెల పంపిణీ కేసును ప్రభుత్వం మళ్లీ తెరపైకి తెచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఖాజా మొయినుద్దీన్ ఇంట్లో గురువారం రాత్రి సోదాలు జరిగాయి. హైదరాబాద్ మణికొండలో ఏసీబీ బృందాలు సోదాలు చేపట్టాయి. ఖాజా మొయినుద్దీన్, అతని కుమారుడు ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నారు. మొయినుద్దీన్ రూ.700 కోట్ల కుంభకోణంలో నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఇదివరకే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ చేపట్టింది. గతంలోనే ఏసీబీ పలువురిని అరెస్టు చేసి రిమాండ్ తరలించింది. ఈ సోదాలు శుక్రవారం కూడా కొనసాగే అవకాశం ఉన్నదని సమాచారం.

## • కొనుగోలు కేంద్రం ఇంకెప్పుడు పెడ్తరు?



వరి కోతలు ప్రారంభమై నెల రోజులైనా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం లేదంటూ జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వీరాపూర్‌కు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. గురువారం వీరు ఉప్పుమడుగు–ఆలూర్ ఎక్స్ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యాన్ని ధోబీఘాట్ వద్ద కుప్పలు పోసి చాలా రోజులవుతున్నా అధికారులు ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదని మండిపడ్డారు. అకాల వర్షాలతో ధాన్యం తడిస్తే తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్ కుమార్, తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యూం రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. – రాయికల్

## • కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెడ్తలే



పంట అమ్ముకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా చాలాచోట్ల కొనుగోళ్లు చేయడం లేదని, ఉన్న కేంద్రాల్లో కాంటా పెట్టడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో అనేకచోట్ల ఇదే పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. తాండూరు మండలం చెంగోల్ బైపాస్ రోడ్డు సమీపంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా ఇప్పటి వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని రైతు లాలప్ప ఆవేదన వ్యక్తంచేశాడు. ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్నామని పలువురు రైతులు పేర్కొన్నారు. రోడ్డుపై ఎంతకాలం ఉండాలని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. – కొడంగల్/తాండూరు రూరల్

## • ధాన్యం కొనాలని రైతుల ఆందోళన



మూడు రోజులుగా పడిగాపులు కాస్తున్నా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. గురువారం నారాయణపేట జిల్లా మాగనూరు ఉమ్మడి మండలంలోని వడ్వాట్ గేటు వద్ద జాతీయ రహదారిపై రైతులు బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పరిమితి లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల హామీ మేరకు రైతులు ఆందోళన విరమించారు. – మాగనూరు

# మిశ్రమ పంటల సాగులో వెనుకంజ

- అంతర పంటల సాగులో 12వ స్థానంలో రాష్ట్రం
- తెలంగాణ రాష్ట్రంలో వరిపైనే గురి
- కేంద్ర, వ్యవసాయ-రైతు సంక్షేమశాఖ అధ్యయనం వెల్లడి

హైదరాబాద్, మే 1 (నమస్తేతెలంగాణ) : మిశ్రమ (అంతర) పంటల సాగులో తెలంగాణ రాష్ట్రం వెనుకంజలో ఉందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ అధ్యయనం వెల్లడించింది. 2023–24 ఏడాది అధ్యయన రిపోర్ట్‌ను ఆ శాఖ తాజాగా విడుదల చేసింది. వరి పంట సాగు, ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, మిశ్రమ పంటల సాగులో పురోగమించడం లేదని గుర్తించింది. రైతులు ప్రధాన పంటలు పండించేందుకే ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నట్టు పేర్కొంది. అంతర పంటలపై అంతగా ఆసక్తి లేకపోవడం, ప్రభుత్వపరంగా ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడం తదితర అంశాలు కారణాలుగా తెలిపింది. మిశ్రమ పంటల సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే 12వ స్థానంలో నిలిచింది.

**నివేదికలోని ముఖ్యాంశాలివే..**

- దేశంలో అంతర పంటల సాగులో బెంగాల్, పంజాబ్, గుజరాత్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం, ఏపీ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల తర్వాత స్థానంలో తెలంగాణ నిలిచిందని నివేదిక పేర్కొన్నది.
- రాష్ట్రం మొత్తం విస్తీర్ణంలో అధిక శాతం వరి పంట సాగుచేస్తున్నారు. యాసంగి సీజన్‌లో 79 లక్షల ఎకరాల భూమిలో పంటలు వేయగా.. 59.28 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. వానకాలం సీజన్‌లో 1.29 కోట్ల ఎకరాలకుగానూ 66 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, తర్వాత 45 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతున్నది.
- పత్తి పంటలో మిశ్రమ పంటలు సాగుచేసే వీలున్నప్పటికీ రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. మొక్కజొన్న, ఇతర పంటల్లో అంతర పంటలను సాగు చేయడం లేదు. వేరుశనగలో 10% మేర సాగు చేస్తున్నారు. ఆయిల్‌పామ్‌లో మిశ్రమ పంటలు 1.39 లక్షల ఎకరాల్లోనే సాగవుతున్నాయి.

## • గన్నీ బ్యాగుల కోసం నిరసన



గన్నీ బ్యాగులు సరిపడా లేక అష్టకష్టాలు పడుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం పెద్దజట్రంలోని రైతు వేదిక వద్ద పెద్దజట్రంతోపాటు బిజ్వారం, అవుసలోనిపల్లికి చెందిన రైతులు నిరసన తెలిపారు. వెంటనే బ్యాగులు అందించాలని వారు డిమాండ్ చేశారు. – ఊట్కూర్

## ఇందిరమ్మ ఇల్లు రాలేదని

### పురుగులమందు తాగిన యువకుడు



కోటపల్లి, మే 1 : ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితా నుంచి కాంగ్రెస్ నాయకులు, అధికారులు తన పేరును తొలగించారనే మనస్తాపంతో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రొయ్యలపల్లికి చెందిన కుమ్మరి రవీందర్ బుధవారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు గమనించి మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## ధ్రువ్ హెలికాప్టర్లకు గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, మే 1: కొన్ని రోజుల క్రితం భారత్ నిలిపివేసిన అధునాతన దేశీయ తేలికపాటి హెలికాప్టర్ ధ్రువ్ కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లోని వాటికి గ్రీన్ సిగ్నల్ వచ్చినప్పటికీ, నౌకాదళంలో ఉన్న హెలికాప్టర్లకు అనుమతి ఇవ్వలేదని తెలిసింది. ఈ ఏడాది జనవరిలో పోరుబందర్‌లో కోస్టుగార్డుకు చెందిన ధ్రువ్ హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో పైలట్ సహా మరొకరు మృతి చెందారు. అంతకుముందు ఒకసారి ఇది ప్రమాదానికి గురైంది. సాంకేతిక లోపం తలెత్తడం, ప్రమాదాలకు గురవుతుండడంతో ధ్రువ్ కార్యకలాపాలను నిలిపివేశారు.

## • కాంగ్రెసోళ్లకే ఇందిరమ్మ ఇండ్లా?



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంఠాయపాలెంలో ఇందిరమ్మ ఇండ్ల విచారణకు వెళ్లిన ఎంపీడీవో పూర్ణచందర్‌రెడ్డిని గ్రామస్తులు నిలదీశారు. 'నిరుపేదలకు ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా రాలేదు. 5 ఎకరాల భూమి ఉన్న వాళ్లు, ట్రాక్టర్లు ఉన్న వాళ్లకు ఇండ్లు కేటాయించడమేంటి'? అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని అర్హులైన పేదలకు ఇండ్లు కేటాయించాలని, లేనిపక్షంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. – తొర్రూరు

## • ఇందిరమ్మ ఇండ్ల కోసం నిరసన



అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి కాలనీవాసులు రోడ్డుకు అడ్డంగా రాళ్లు, కర్రలు పెట్టి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలమైనప్పటికీ తమకు ఇండ్లు మంజూరు కాలేదని వాపోయారు. అధికారులు బాధ్యతగా సర్వే చేసి నిరుపేదలందరికీ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. –అన్నపురెడ్డిపల్లి

# 'ఇందిరమ్మ' లొల్లిపై.. ఇంటెలిజెన్స్ నిఘా!

- గ్రామాల్లో వాట్సాప్ గ్రూపుల్లోని రచ్చంతా చేరవేత
- ఆవేశంతో పోస్టులు పెట్టేవారికి ఫోన్ల ద్వారా వార్నింగ్
- పోస్టులు డిలీట్ చేయాలని ఆదేశాలిస్తున్న సిబ్బంది
- కలెక్టరేట్‌లో ఫిర్యాదులు చేసుకోవాలని సూచనలు

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్లను కేవలం కాంగ్రెస్ పార్టీ వారికే కేటాయిస్తున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనల హోరు మొదలైంది. దీంతో రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ వర్గాలు ఎక్కడి నిరసనలను అక్కడే తొక్కిపట్టే ప్రయత్నం చేస్తున్నాయి. గ్రామాల్లో ఎవరైనా ఇందిరమ్మ ఇండ్లు తమకు రాలేదని ఆందోళనలు చేసినా, నిరసన తెలిపినా వెంటనే 'ఇక చాలు ఆపండి' అంటూ ఇంటెలిజెన్స్ సిబ్బంది నుంచి కాల్స్ వస్తున్నాయని ప్రజలు చెప్తున్నారు. ఎవరైనా వాట్సాప్ గ్రూపుల్లో ఆవేశంగా పోస్టులు పెడితే వెంటనే.. 'మీరు పెట్టిన పోస్టును తక్షణమే డిలీట్ చేయండి. లేకపోతే చట్టపరంగా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది' అంటూ ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి బెదిరింపులు వస్తున్నాయని పలువురు వాట్సాప్ యూజర్లు చర్చించుకుంటున్నారు. నిరసన తెలిపే వారికి నేరుగా ఫోన్ చేస్తున్న పోలీసులు.. గ్రామాల వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టకుండా స్థానిక కలెక్టరేట్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నట్టు సమాచారం. ఈ విధంగా పోలీసుల నుంచి కాల్స్ వస్తుండటంతో తమ వాట్సాప్ గ్రూపులపై ఇంటెలిజెన్స్ వర్గాలు నిఘా పెట్టాయని భావిస్తున్న గ్రూపు అడ్మిన్లు 'అనుమానిత నంబర్ల'ను తమ గ్రూపుల నుంచి తొలగిస్తున్నట్టు తెలిసింది.

# స్కైప్ సేవలకు మైక్రోసాఫ్ట్ స్వస్తి

**ఈ నెల 5 నుంచి నిలిపివేత**

న్యూఢిల్లీ, మే 1: ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయిన వీడియో–కాలింగ్ ప్లాట్‌ఫామ్ 'స్కైప్' సేవలు ఈ నెల 5 నుంచి నిలిచిపోనున్నాయి. స్కైప్‌కు వీడ్కోలు (ఫేర్‌వెల్) పలుకుతున్నామని, మే 5 తర్వాత యూజర్లకు ఈ అప్లికేషన్ అందుబాటులో ఉండదని మైక్రోసాఫ్ట్ తాజాగా వెల్లడించింది. దీనిని వాడుతున్న యూజర్లు 'టీమ్స్'కు మారాల్సి ఉంటుందని తెలిపింది. స్కైప్ తన వీడియో కాన్ఫరెన్సింగ్ సేవల్ని 2003లో తొలుత ప్రారంభించింది. అప్పట్నుంచీ దాదాపు 2 దశాబ్దాలుగా పాపులర్ ఫ్లాట్‌ఫామ్‌గా నిలిచింది. దీనిని 2011లో మైక్రోసాఫ్ట్ కొనుగోలు చేసింది. 2017లో మైక్రోసాఫ్ట్ టీమ్స్‌ను లాంచ్ చేసినప్పటి నుంచి స్కైప్ అంతర్గతంగా పోటీ ఎదుర్కొంటున్నది. ఆధునిక సమాచారం, సహకార వ్యవస్థకు ప్రైమరీ హబ్‌గా 'మైక్రోసాఫ్ట్ టీమ్స్'ను నిలుపబోతున్నట్టు సంస్థ ప్రకటించింది. తమ యూజర్ల కమ్యునికేషన్ టూల్స్ అన్నింటినీ ఒక గొడుగు కిందకు తీసుకువచ్చేందుకు 'స్కైప్'కు వీడ్కోలు పలుకుతున్నట్టు తెలిపింది.